
సుభాష్‌నగర్‌లో నాలా స్థలం కబ్జా చేసి చేపట్టిన నిర్మాణం

కబ్జా గుప్పిట్లో ప్రభుత్వ స్థలాలు

నాలా స్థలం కబ్జాచేసి నిర్మాణాలు

జీడిమెట్ల: కబ్జాదారుల ఆక్రమణలను అడ్డుకోవడంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు. ప్రజలకు సేవలను అందిస్తూ ప్రభుత్వ అస్థులను కాపాడాల్సిన కుత్బుల్లాపూర్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో కబ్జాదారులకు వారి పూర్తి అండదండలు ఉండటంతో వారు జాగా కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. బాజాప్తాగా నిర్మాణాలు చేపట్టి ప్రభుత్వ స్థలాలను వారి అ.దీనంలోకి తీసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం మిన్నకుండిపోతున్నారు.

మాయమవుతున్న శిఖం, ఎఫ్‌టీఎల్, నాలా స్థలాలు..

సుభాష్‌నగర్‌లో ఇటీవల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే గడిచిన 5 సంవత్సరాల్లో ప్రభుత్వ భూమిని ఎంతమంది స్వాధీనం చేసుకున్నారో అర్థం అవుతోంది. గత 15రోజుల క్రితం ఓ వ్యక్తి ఏకంగా నాలాలో మట్టి నింపి నిర్మాణం చేపట్టాడు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న 'సాక్షి'వార్తను ప్రచురించడంతో అధికారులు నిర్మాణాన్ని అడ్డుకున్నారు.

◆ రెండు నెలల నుంచి మరో వ్యక్తి గంపల బస్తీలో నాలా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని చేపట్టాడు. విషయం తెలుసుకున్న స్థానికులు కబ్జా విషయమై కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి సైతం చూడటం లేదని స్థానికులు అధికారులపై కన్నెర్ర చేస్తున్నారు.

టౌన్‌ప్లానింగ్‌లో నాకింతా నీకింతా.!

టౌన్‌ప్లానింగ్‌లో ఓ ఉన్న ఓ సీనియర్ వ్యక్తి అటు అధికారులకు ఇటు అక్రమార్కులను మధ్య డీలింగ్స్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నాడనే వార్తలు గుప్పుమంటున్నాయి. అతడు అక్రమార్కుల వద్ద నుంచి కొంతమేర సొమ్ము తీసుకువచ్చి అధికారులకు అప్పజెప్పన్నాడని ముడుపులు చెల్లించిన వారు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లు తెరచి కబ్జాలను ఆపకపోతే ప్రభుత్వ జాగాలు అనే పేరు మరచిపోవాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు.

స్పందిస్తారు కానీ ఫెన్సింగ్ వేయరు!

- అడ్డుపడుతుంటే ఎలా సాధ్యమంటున్న అధికారులు
- పోలీసు బందోబస్తు నడుమ ఫెన్సింగ్ వేయాలంటున్న భగత్‌సింగ్‌నగర్ వాసులు
- ప్రభుత్వ స్థలం కబ్జాకాకుండా కాపాడాలంటూ డిమాండ్


ప్రభుత్వ స్థలంలో కడీలను వేసిన ధోబీఘాట్ వాసులు


ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ వేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగిన ధోబీఘాట్ వాసులు

చింతల్: డివిజన్ భగత్‌సింగ్‌లో ఉన్న 1.29 ఎకరాల ప్రభుత్వ స్థలానికి రక్షణ కరువైంది. దీనిపై 'సాక్షి'లో ఈనెల 17న 'ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు'ఈనెల 29న '3 మీకు.. 4 మాకు' అనే శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'సాక్షి'లో వస్తున్న వరుస కథనాలకు జీహెచ్ఎంసీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. అయితే ఎప్పటి లాగా అధికారులు తమ యంత్రాంగంతో అక్కడి వెళ్లడం.. ధోబీఘాట్‌వాసులు అడ్డుపడటం.. యథావిధిగా వెనక్కి వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. డీసీ మల్లారెడ్డి నేతృత్వంలో డీఈఈ శిరీష, ఏఈ సంపత్ అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. దీంతో ధోబీఘాట్ వాసులు అడ్డుపడటంతో అధికారులు వెనక్కి తగ్గారని భగత్‌సింగ్ నగర్ వాసులు చెబుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

◆ స్టార్‌లైట్ పక్కన ఉన్న సుమారు ఎకరంపైగా ఖాళీ స్థలం ధోబీఘాట్‌వాసుల ఆధీనంలో ఉంది. అంతేకాకుండా వారి ఆధీనంలో ఉన్న స్థలంలో కొంత మసీదు నిర్మాణానికి విక్రయించారు. అంతేకాకుండా ఖాళీగా ఉన్న స్థలాన్ని సైతం ధోబీఘాట్ వాసులు ఆక్రమించారని భగత్‌సింగ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఈసారైనా ఖాళీ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని భగత్‌సింగ్‌నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఆ స్థలంలో పేదలకు ఉపయోగపడే నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.


కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

◆ గతంలో ధోబీఘాట్ వాసులపై భూకబ్జా కేసులు నమోదైనా తాజాగా అడ్డుకోవడం కొసమెరుపు. 2007లో స్థలాన్ని కొలవగా కొలతలతో కూడిన 3500 చదరపు గజాల స్థలం ఉన్నట్లు తేలింది. 2007లో ల్యాండ్ ప్రొటెక్షన్ కింద జీహెచ్ఎంసీకి ఈ స్థలాన్ని బదలాయించినా ఫెన్సింగ్ పనులు ముందుకు సాగలేదు. 30 ఏళ్లుగా ఇదే కొనసాగుతోందని భగత్‌సింగ్‌నగర్ వాసులు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ నిజాంపేట్ ఫీడర్ పరిధిలోని నిజాంపేట్ మెయిన్ రోడ్డు, పాలంపల్లి విల్లాస్, రత్నదీప్ సూపర్‌మార్కెట్, గ్రీన్ ఎవెన్యూ, బాలాజీ పార్క్‌టౌన్, బాలాజీ వెస్ట్‌కౌంటీ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

బాచుపల్లి పరిధిలో..

◆ హెచ్ఎండీఏ ఫ్లైఓవర్ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శిఖల విల్లాస్ నుంచి బాచుపల్లి సిగ్నల్స్, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి కమిటీ హాలు వెనుక గల్లీ, గణేష్ మండపం, ఎస్వీఆర్ ప్రైడ్, లోటస్ ప్రైడ్, సాన్వి కన్‌స్ట్రక్షన్స్, కౌసల్య మణిదీపం, ఎస్‌వీఎం గ్రాండ్, శ్రీరామ హోమ్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రగతినగర్ పరిధిలో..

◆ 11కేవీ డాక్టర్స్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం ఫీడర్ల పరిధిలోని శిల్పా లేఅవుట్, కెనరా బ్యాంక్ ఏరియా, సాయికృష్ణ కాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు.. అదే విధంగా రాజీవ్‌గృహకల్ప, జగన్ స్టూడియో ఫీడర్ల పరిధిలోని వాసవీ లేఅవుట్, న్యూ విజేత సూపర్‌మార్కెట్ ప్రాంతం, ఎన్ఆర్ఐ కాలనీ, చర్చి రోడ్డు, అక్షర స్కూల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ తెలిపారు.

◆ **హెచ్ఎంటీ, భగత్‌సింగ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో..**

జగద్గిరిగుట్ట: హెచ్ఎంటీ సబ్‌స్టేషన్ పరిధిలోని చింతల్, చంద్రానగర్, రంగానగర్, సాయికాలనీలలో మంగళవారం ఉదయం 10 నుంచి 12గంటల వరకు.. చింతల్ సబ్‌స్టేషన్ పరిధిలోని చింతల్, చంద్రానగర్, శివా నగర్‌లలో ఒంటిగంట నుంచి 3గంటల వరకు.. భగత్‌సింగ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్, చంద్రానగర్, దుర్గానగర్, స్ఫూర్తినగర్‌లలో 3 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ రాధాకిషన్‌రెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన శంభీపూర్ రాజు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం


కేటీఆర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కాసాని వీరేశ్‌ముదిరాజ్

నిజాంపేట్: బాచుపల్లిలో జరుగనున్న కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు రావాలని మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కాసాని వీరేశ్‌ముదిరాజ్ సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డిలను కలిసి ఆహ్వానించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి కబడ్డీ అసోసియేషన్, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుండి 4వ తేది వరకు బాచుపల్లిలోని కబడ్డీ అకాడమీలో జరుగనున్నాయి. వీరేశ్ ముదిరాజ్ వెంట ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ లు ఉన్నారు.

తాగునీటి, యూజీడీ పైపులైన్ పనులు చేపట్టాలి


జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మహానగర్ అసోసియేషన్ సభ్యులు

చింతల్: మహానగర్‌కాలనీలో తాగునీటి, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు నిధులు మంజూరై పనులు ప్రారంభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డిని కలిసి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహానగర్‌లోని రోడ్ నం.4లో 100 మీటర్ల మేర పైపులైన్ పనులకు ఏడాది క్రితమే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా మిగతా గల్లీల్లోనూ తాగునీటి పైపులైన్, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వేయాలని జీఎంను కోరారు.

రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

రంగారెడ్డినగర్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు బి.శివకుమార్ ఆధ్వర్యంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఐడీపీఎల్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రోడ్డు విస్తరణ పనుల కోసం తొలగించారు. తిరిగి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

నియోజకవర్గంలో సుపరిపాలన అందిస్తున్నాం


ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న స్థానిక మహిళలు

కుత్బుల్లాపూర్: ప్రజల అభిమతానికి అనుగుణంగా నియోజకవర్గంలో సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా సోమవారం గాజులరామారం డివిజన్ బతుకమ్మబండలో పర్యటించి ఎమ్మెల్యేను స్థానిక మహిళలు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ఇప్పటికే కోట్లాది నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ముమ్మందు ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్, ఇబ్రహీం, ఆంజనేయులు, మూసాఖాన్, మురళి, శ్రీనివాస్, ప్రసాద్, చిన్న చౌదరి, మహేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంలో మహిళా కార్యకర్తల పాత్ర కీలకం

సుభాష్‌నగర్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో మహిళా కాంగ్రెస్ నాయకులు కీలకంగా వ్యవహరించారని... వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. సోమవారం గాజులరామారం విన్ ప్యాలస్‌లో మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాచనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు కొలన్ హన్మంతరెడ్డి, బండి రమేష్, కూకట్‌పల్లి నాయకుడు సత్యం శ్రీరంగం పాల్గొని ప్రసంగించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మాదిరిగా కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని అభిలాషించారు. ఈ సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ సొంటిరెడ్డి పున్నారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, జిల్లా నాయకులు శ్రావణ్ కుమార్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మ్యాక్స్ కార్మికులకు న్యాయం చేయాలి

బంజారాహిల్స్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలో సూపర్ మ్యాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని అర్ధంతరంగా మూసివేయడంతో సుమారు వెయ్యి మంది కార్మికులు రోడ్డున పడ్డారని... వారిని ఆదుకోవాలంటూ కార్మికులు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వద్దకు వచ్చారు. గడిచిన రెండేళ్లుగా కార్మికులకు ఎటువంటి జీతాలు ఇవ్వకుండా... ఎలాంటి కారణాలు చూపకుండా ఎంతో మందిని విధుల నుంచి తొలగించారని తెలిపారు.పని చేసిన నెలలకు వేతనాలు ఇవ్వాలని వేడుకున్నా మేనేజ్‌మెంట్ పట్టించుకోలేదని గతంలో ఈ సమస్యను అప్పటి మంత్రి కేటీఆర్,ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

◆ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడినా సరైన సమాధానం చెప్పలేదని వారు తెలిపారు. ప్రభుత్వం కలుగజేసుకొని దీనస్థితిలో ఉన్న కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇప్పించడంతో పాటు తగు న్యాయం చేయాలని కోరారు. కాగా సీఎం అపాయింట్‌మెంట్ లేకుండా వచ్చారని పోలీసులు వారిని తొలుత అడ్డుకున్నారు. అనంతరం సీఎం కార్యాలయ అధికారులు వీరి వినతి పత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక జేఏసీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, పెద్దిరెడ్డి, శ్రీనివాసరావు, ఈశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి ఉన్నారు.


సీఎంను కలిసేందుకు వచ్చిన సూపర్ మ్యాక్స్ కార్మికులు

సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి


అధికారులతో కలిసి ప్రజావాణిలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ డీసీ నర్సింహ


ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రావుల శేషగిరి

కుత్బుల్లాపూర్: ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం తోడ్పడుతుందని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ నర్సింహ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ (06), టౌన్‌ప్లానింగ్ (03), టాక్స్ (03) మొత్తం 12 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ (01), అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (01), ఎలక్ట్రికల్ (01) మొత్తం మూడు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకున్న డీసీ నర్సింహ మాట్లాడుతూ... సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాజులరామారంలో అభివృద్ధి పనులు చేపట్టాలి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ పరిధి సుభాష్‌చంద్రబోస్‌నగర్, చంద్రగిరినగర్‌లలో సీసీ రోడ్లు, అంబేద్కర్‌నగర్‌లో నాలా శ్లాబ్, బాలయ్యనగర్‌లో శ్మశానవాటిక ప్రహరీ నిర్మించాలని కార్పొరేటర్ రావుల శేషగిరి డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయా కాలనీల అసోసియేషన్ల సభ్యులతో కలిసి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

పిల్లలను తప్పకుండా పాఠశాలలకు పంపాలి


స్మైల్10 కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న జిల్లా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాజారెడ్డి

జీడిమెట్ల: మురికివాడల్లో ఉండే పిల్లలను వారి తల్లిదండ్రులు తప్పకుండా పాఠశాలలకు పంపాలని మేడ్చల్ మల్కాజిగిరి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాజారెడ్డి అన్నారు. జిల్లాలో స్మైల్ టీమ్ చేపట్టిన 'స్మైల్ 10'కార్యక్రమాన్ని సోమవారం సూరారం, మెట్కానిగూడలో టీం సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు సాయిబాబానగర్, మెట్కానిగూడలో 22మంది చిన్నారులను గుర్తించారు. అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో రాజారెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులను పాఠశాలలకు పంపిస్తే వారి భవిష్యత్ బాగుంటుందన్నారు.

◆ చదువుకున్న పిల్లలు కుటుంబాన్ని ఉన్నత స్థానానికి తీసుకెళ్తారని అన్నారు. ఆధార్‌కార్డు లేని పిల్లలకు అక్కడే క్యాంప్ ఏర్పాటు చేసి ఆధార్‌కార్డులను జారీ చేస్తామని తెలిపారు. పిల్లలు స్థానికంగా ఉండే పాఠశాలల్లో చేరే విధంగా తాము చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఖచ్చితంగా పాఠశాలలకు పంపాలని తెలియజేశారు. 'స్మైల్ 10' కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ రామ్మోహన్, మేడ్చల్ డివిజన్ స్మైల్ టీమ్ ఎస్సై శంకర్‌గౌడ్, మేడ్చల్ జోన్ స్మైల్ టీమ్ అధికారి వెంకటగిరి, డీసీపీయూ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండానే నిర్మాణాలు!

- జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి
- జంట సర్కిళ్లలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- నోటీసులకే పరిమితం అవుతున్న అధికారులు


కుత్బుల్లాపూర్ గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

కుత్బుల్లాపూర్: అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాలు జారీ చేస్తున్నా కిందిస్థాయి సిబ్బంది మాత్రం వాటిని పెడచెవిన పెడుతున్నారు. ఇప్పటికే అటు కుత్బుల్లాపూర్ ఇటు గాజులరామారం జంట సర్కిళ్లల్లో అక్రమ నిర్మాణాలతో జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా సంబంధిత శాఖ అధికారుల్లో చలనం లేకుండా పోయింది. కుత్బుల్లాపూర్ గ్రామం ప్రధాన రోడ్డుపైనే ఓ నిర్మాణానికి అసలు అనుమతే లేకుండా భారీ నిర్మాణాన్ని చేపడుతూ వస్తున్నాడు.

◆ ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు రాగా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇంకేముంది.. చకచకా 4 అంతస్తులు పూర్తి చేసి ప్రధాన రోడ్డును 'కవర్'చేస్తూ నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయడం విశేషం. ఇప్పటికే అక్రమ నిర్మాణాలతో భారీగా ఆదాయాన్ని కోల్పోతున్న జీహెచ్ఎంసీ దిద్దుబాటు చర్యలు తీసుకోక ముందే ఎక్కడపడితే అక్కడ అధికారుల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి.

– అదే విధంగా వెన్నెలగడ్డ సెయింట్ ఆంథోని స్కూల్ పక్కనే ఓ నిర్మాణదారుడు ఎటువంటి డివియేషన్ లేకుండానే భారీ నిర్మాణం చేపడుతున్నాడు. ఈ నిర్మాణ విషయంపై కూడా అధికారులకు ఫిర్యాదులు రాగా నోటీసులు అందజేసినట్లు తెలిసింది. కేవలం నోటీసులకే పరిమితం అవుతూ.. కూల్చివేతలు తమ పరిధి కాదు.. అన్నట్లుగా టౌన్ ప్లానింగ్ అధికారులు చేతులెత్తేయడం విశేషం.

– కూకట్‌పల్లి జోనల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు ఫిర్యాదులు, నోటీసులు జారీ చేసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాల్సి ఉండగా వారు కూడా అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి అందిన కాడికి దండుకుంటున్నారన్న ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబాను 'సాక్షి'వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామని చెప్పడం విశేషం.


వెన్నెలగడ్డ సెయింట్ ఆంథోని స్కూల్ వద్ద సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మిస్తున్న భవనాలు ఇవే..

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి


జయరామ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీజేపీ నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులను త్వరిగతిన పూర్తిచేయాలని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ జయరామ్‌నగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ... కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి సహకారంతో డివిజన్‌లోని అన్ని బస్తీల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పులి బలరామ్, విఠల్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ పరిధిలో వెనెలగడ్డలోని ఎన్నా చెరువును ఆనుకుని గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారి ఇళ్లను కూల్చివేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో బీజేపీ నేత భరతసింహారెడ్డి స్థానికులతో కలిసి ప్రజావాణిలో ఉపకమిషనర్ నర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న వారికి న్యాయం చేయాలన్నారు. ఇళ్ల కూల్చివేతపై పునరాలోచించాలని కోరారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, నరసింహారెడ్డి, భీమ్‌రావు తదితరులు ఉన్నారు.

'చెరువును పూడ్చేస్తున్నారు'

సుభాష్‌నగర్: రేపటి తరానికి తాగునీటిని ఇచ్చే చెరువులను కొంత మంది స్వార్థానికి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. గాజులరామారం గ్రామాన్ని అనుకొని ఉన్న బంధం చెరువు ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకుంది. గత కొన్ని రోజుల నుంచి బంధం చెరువు చుట్టూ మట్టిని పోస్తూ పూడ్చుతున్నారు. సర్వే నం.468లో 12 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ బంధం చెరువు ఇప్పటికే 5 ఎకరాల మేర కబ్జాకు గురికాగా, మిగిలిన స్థలంపై కొంతమంది కన్ను పడింది. గత కొన్ని రోజులుగా రాత్రివేళల్లో చడీచప్పుడు కాకుండా శివసాయిహిల్స్ కాలనీ అనుకొని జగద్గిరిగుట్టకు చెందిన ఓ వ్యక్తి మట్టితో చెరును పుడుస్తూ ప్లాట్లు చేస్తున్నారు. స్థానికంగా గజం విలువ రూ.70వేలు పలుకుతోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి విలువైన స్థలాన్ని కాపాడాలన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


గాజులరామారంలో బంధం చెరువును మట్టితో నింపుతున్న దృశ్యం